కుంట్లూర్ డబుల్ లేఅవుట్‌పై కలెక్టర్ సీరియస్

● సందర్శించిన ఆర్డీవో, తహసీల్దార్

● హెచ్‌ఎండీఏ అనుమతులు రద్దు చేయిస్తామని హెచ్చరిక

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని డబుల్ లేఅవుట్‌లపై రంగారెడ్డి కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన ధరణి గోల్‌మాల్ కథనంతో జిల్లా పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 174, 175, 176లోని చిన్న చెరువు శిఖంలో వెలసిన డబుల్ లేఅవుట్‌పై కలెక్టర్ ఆదేశాలతో బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్తు సందర్శించారు. ఈ సందర్భంగా కుంట్లూర్‌లో జరుగుతున్న డబుల్ లేఅవుట్ పనులను నిలిపివేయించారు. ఎట్టి పరిస్థితిల్లో పనులు చేయొద్దని హెచ్చరించారు. గతంలోనే చేసిన లేఅవుట్‌లో మరోసారి లేఅవుట్‌కు అనుమతులు ఇచ్చిన హెచ్‌ఎండీఏకు సదరు లేఅవుట్ అనుమతులు రద్దు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. డబుల్ లేఅవుట్ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సదరు సర్వే నంబర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేయవద్దని వాటి పరిధిలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్ ఆదేశాలతో పూర్తి విచారణ చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. అదేవిధంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పిగ్లీపూర్, బండరావిరాల సర్వే నంబర్ 293 భూములను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, భూదాన్, వక్ఫ్‌భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో లేఅవుట్‌లు చేసి ప్లాట్లు విక్రయించిన భూములను తిరిగి వ్యవసాయ భూములుగా మార్చుకోవాలనుకునేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి భూముల్లో డబుల్ లేఅవుట్ చేసిన వాటిని రద్దు చేయిస్తామని ఆర్డీవో తెలిపారు. ధరణి సాకుతో వెలసిన డబుల్ లేఅవుట్‌ల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని వాటన్నింటిని గుర్తించి హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులను రద్దు చేయిస్తామని హెచ్చరించారు. మండల పరిధిలో జరిగిన డబుల్ లేఅవుట్‌లపై పూర్తి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ జ్యోతి, ఆర్‌ఐ నిజాముద్దీన్ పాల్గొన్నారు.



డబుల్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా ముకుంద్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ముకుంద్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా పి. ముకుంద్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన పంకజ సెలవుపై వెళ్లడంతో ముకుంద్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ముకుంద్‌రెడ్డి గతంలో హయత్‌నగర్, బేగంపేట్, కాప్రా సర్కిళ్ల ఉపకమిషనర్‌గా, నిజాంపేట కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని ఆయన అన్నారు.

అయోధ్య రాముడు అందరివాడు : మధుయాష్కీ



అయోధ్య రామాలయంలో మధుయాష్కీగౌడ్ తదితరులు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని శ్రీరాముడు అందరికీ దేవుడని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. అయోధ్యలోని రామాలయాన్ని మధుయాష్కీగౌడ్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు ఏ కొందరికో పరిమితం కాదని స్పష్టం చేశారు. బాలరాముడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మధుయాష్కీతో పాటు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అమెరికా నాయకులు ఉన్నారు.



కలశాభిషేక పూర్ణాహుతిలో భక్తులు

ముగిసిన సీతారామచంద్రస్వామి వార్షికోత్సవం

చంపాపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని నిర్మలానగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయ శివ సీతారామచంద్రస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగిన ద్వితీయ వార్షికోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఆలయంలో స్వామి వారికి మండప పూజలు, కలశాభిషేక పూర్ణాహుతి, బలిహరణం, కలశాధ్వసనం, పల్లకిసేవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి జైలు వార్డర్లకు శిక్షణ

సైదాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి(టీఎస్‌ఎల్పీఆర్బీ) ద్వారా ఇటీవల ఎంపికైన జైలు వార్డర్లకు శిక్షణను చంచల్‌గూడలోని సీకా పెరేడ్ గ్రౌండ్‌లో జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా గురువారం ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నారు. మొత్తం 136మంది ఎంపిక కాగా 85మంది అభ్యర్థులు (78మంది పురుషులు, ఏడుగురు మహిళలు) మాత్రమే శిక్షణ తీసుకునేందుకు రిపోర్టు చేశారు. తొమ్మిది నెలల పాటు జరుగనున్న శిక్షణలో పాఠ్యాంశాలు, ఫుట్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, ఫైరింగ్ ప్రాక్టీస్, కరాటే, సెల్ఫ్ డిఫెన్స్, యోగా ఫిజికల్ ఫిటినెస్ తర్ఫీదు ఇవ్వనున్నారు. అంతేగాకుండా ఐసీసీ, సీఆర్‌పీసీ, జైలు మాన్యువల్, లీగల్ యాక్ట్స్, సెక్యూరిటీ ప్రొటోకాల్, ఖైదీల నిర్వహణ, రోజువారీ బాధ్యతలు, సవాళ్లు ఎదుర్కొనే విధంగా తరగతులు నిర్వహించనున్నారు.



విభిన్న రాష్ట్రాల సంస్కృతి ఉట్టి పడేలా వస్త్రధారణతో విద్యార్థులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యత వెలికి తీసి రూపొందించిన ప్రదర్శనలు ప్రశంసనీయమని చార్మినార్ డిప్యూటీ డీఈవో నెహ్రూబాబు అన్నారు. బుధవారం చాదర్‌ఘాట్‌లోని ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ స్కూల్‌లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రిన్సిపాల్ నాచం సుధాకర్‌తో కలిసి ప్రారంభించారు. వైజ్ఞానిక ప్రదర్శనలతో పాటు విద్యార్థులు విభిన్న రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేలా ధరించిన వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశాన్ని పాలించిన రాజుల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆనంద్, చాదర్‌ఘాట్ ఎస్‌ఐ కృష్ణ మోహన్, ప్రధానోపాధ్యాయురాలు బిల్కిస్ ఫాతిమా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

● డీసీసీ ప్రధాన కార్యదర్శి వక్కలంక

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తనపై పెట్టిన బాధ్యతను శక్తి వంచనలేకుండా కృషి చేసి పార్టీని బలోపేతం చేస్తానని రంగారెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా వక్కలంకను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని అట్టడుగుస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించి అందుకనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి తగిన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అవ్వ లక్ష్మీనరసింహారావు, ఆర్కే దేశ్‌ముఖ్, మంత్రి సునీల్, సీనియర్ జర్నలిస్టు అక్కినెపల్లి పురుషోత్తంరావు, దేవులపల్లి అశోక్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



మందులను స్వాధీనం చేసుకుంటున్న ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు

లేబుల్స్ మార్చి దందా

● ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మందుల విక్రయం

● రెండుచోట్ల అధికారుల దాడి, స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): లేబుల్స్ మార్చి ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మందులు విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు గ్రేటర్‌లో రెండుచోట్ల దాడులు చేసి మందులు స్వాధీనం చేసుకున్నారు. ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడలో ఓ సంస్థ మెరోపినం 1000 ఇంజెక్షన్ ఒక గ్రామ్ వయల్ ధర ఎంఆర్‌పీ, జీఎస్‌టీ కలిపి రూ. 1,067కు విక్రయించాల్సి ఉండగా రూ.3,500కు అమ్ముతోంది. హయత్‌నగర్‌లో ఇట్రాజోల్ 200 గ్రాముల క్యాప్సూల్స్ ధర ఎంఆర్‌పీ, జీఎస్‌టీతో కలిపి పది క్యాప్సూల్స్ రూ.24.77 ఉండగా.. రూ.37.5కు విక్రయిస్తున్నారు. దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ రాజమౌళి, అంజు మా అబిద, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వివేకానందరెడ్డి, సంతోష్, అజయ్, రాజు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ బడ్జెట్ రూ.35.41 కోట్లు

● గతంతో పోలిస్తే రూ.12కోట్లు అధికం

● మురికివాడల్లో మౌలిక సదుపాయాలకు ప్రత్యేక చర్యలు

● చైర్‌పర్సన్ స్వప్నాచిరంజీవి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ చెవుల స్వప్న అధ్యక్షతన బుధవారం తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 35.41 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టారు. గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే ఈ ఏడాది రూ. 12 కోట్ల అంచనా బడ్జెట్ పెరిగింది. కాగా 35.41 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.1.80 కోట్లు అప్పు ఉన్నట్లు బడ్జెట్‌లో చూపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ స్వప్నచిరంజీవి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని మురికివాడల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా అభివృద్ధి చెందని వార్డులు, బలహీన, మైనార్టీ వర్గాలు, పార్కులు, వైకుంఠధామాలు, మరుగుదొడ్లు, డంపింగ్ యార్డుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించినట్లు స్వప్న తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్తులు, నూనెలు, సబ్బులు, చెప్పులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్, డీఈఈ అశోక్ కుమార్‌తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వప్న



జాతీయ టీటీలో హితేష్‌కు 3 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్ డి.హితేష్ మూడు పతకాలు కొల్లగొట్టాడు. ఇండోర్‌లో మూడ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో సింగిల్స్‌లో హితేష్ 3-1తో విశ్వ (మహారాష్ట్ర)పై నెగ్గగా, డబుల్స్ హితేష్-కునాల్ జోడీ 3-2తో ప్రసాద్-రవీంద్ర (హరియాణా) ద్వయంపై, మిక్స్‌డ్ డబుల్స్‌లో హితేష్-బేబీ సహానా జోడీ 3-1తో విశ్వ-నతానియా (ఢిల్లీ) ద్వయంపై గెలిపొందింది.

రేపు హైదరాబాద్ అథ్లెటిక్స్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ మీట్ ట్రయల్స్‌ను శుక్రవారం నిజాం కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు రాజేష్ కుమార్ ప్రకటించారు. బాలబాలికలు, పురుషులు, మహిళలకు విడివిడిగా ఉదయం 6 గంటల నుంచి ట్రయల్స్‌ను జరపనున్నట్టు వెల్లడించారు. అండర్-14, 16, 18, 20 విభాగాలలోకల ట్రయల్స్‌ను నిర్వహించనున్నామని రాజేష్ చెప్పారు.

మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో విజయాలు సాధించింది: బీజేపీ

● 23న ఎల్బీనగర్‌లో విజయ సంకల్పయాత్ర

మన్సూరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశంలో ఎన్నో విజయాలను సాధించిందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదు క్లస్టర్లుగా బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర ఈనెల 23న ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో చేరుకుంటున్న నేపథ్యంలో బుధవారం ఎల్‌బీనగర్‌లో, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ నినాదమే విధానంగా 140కోట్ల భారతీయుల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. రథయాత్ర బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, బైరామల్‌గూడ, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, మోహన్‌నగర్ మీదుగా నాగోల్‌కు చేరుకొని, అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోదీ ప్రధానిగా మళ్లీ బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, కార్పొరేటర్లు ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నవజీవన్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు చింతల సురేందర్‌యాదవ్, బండారి భాస్కర్, కృష్ణవేణి, శైలజ, రామేశ్వర్ పాల్గొన్నారు.



విజయ సంకల్ప యాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, సామ రంగారెడ్డి తదితరులు

దర్గా పరిసరాలను శుభ్రం చేయించండి: మీర్ హాది అలీ

హయత్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న ముస్లింలు పవిత్రంగా జరుపుకునే షబ్బే బరాత్‌ను పురస్కరించుకుని హయత్‌నగర్ డివిజన్‌లోని సత్యనారాయణ కాలనీలో ఉన్న దర్గా పరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతూ సత్యనారాయణ కాలనీ మైనారిటీ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మీర్ హాది అలీ బుధవారం జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. షబ్బే బరాత్ రోజున ప్రతి ముస్లిం నమాజ్ చేసి దర్గా శ్మశానవాటికను సందర్శిస్తారని తెలిపారు. కాలనీలోని దర్గా చుట్టు అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. పిచ్చి మొక్కలు మొలవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. 25వ తేదీ లోపల దర్గా పరిసరాలను శుభ్రం చేయించాలని కోరారు. స్థానికంగా ఒక విద్యుత్ స్తంభాన్ని నాటించి దానికి వీధి లైటు ఏర్పాటు చేయించాలన్నారు. పరిసరాల చుట్టు బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డిలు శ్రద్ధ వహించి తమ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

మేజిక్ ఫిగర్‌కు దగ్గరలో మీర్‌పేట్ 'అవిశ్వాస' అంకం..!

● నేడో రేపో కలెక్టర్‌కు లేఖ ఇచ్చే అవకాశం..?

సరూర్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ దాదాపు ఖాయమైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలో నేడో, రేపో కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసంపై లేఖ అందజేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం! మీర్‌పేట్‌లో మొత్తం 46 మంది కార్పొరేటర్లు ఉండగా, అవిశ్వాసం పెట్టడానికి గాను 2/3 వంతు కింద 31 మంది సభ్యులు అవసరం అవుతారు. బీఆర్‌ఎస్‌లోని అసంతృప్తులు, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు, బీజేపీ సభ్యులు కలిపి ఆ సంఖ్యకు సమీపంగా చేరుకున్నట్టు తెలిసింది. మరో ఇద్దరు సభ్యులు రెడీగా ఉన్నప్పటికీ కలెక్టర్‌కు అందజేయనున్న లేఖలో సంతకాలు చేయలేదని సమాచారం. వారిద్దరు కూడా సంతకాలు చేస్తే మేజిక్ ఫిగర్ కన్నా ఇద్దరు సభ్యుల బలం ఎక్కువే అవుతుంది. కాగా సదరు ఇద్దరు సభ్యులు సంతకాలు పెట్టకపోయినా కలెక్టర్‌కు లేఖ మాత్రం అందజేయాలని 31 మంది సభ్యులు భావిస్తున్నారు. అవిశ్వాసం నెగ్గితే బీజేపీ, కాంగ్రెస్ చెరో పదవి పంచుకోవాలనే ఒప్పందానికి వచ్చినట్టు తెలిసింది. అదే జరిగితే బీఆర్‌ఎస్‌కు పెద్ద ఎదురు దెబ్బ తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు.

రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి

● రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్



సీఎం రేవంత్‌రెడ్డి దంపతులను కలిసిన అనిల్‌కుమార్‌యాదవ్ దంపతులు

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు, నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తాను రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ధ్రువీకరణ పత్రాన్ని సీఎంకు అందజేసి సన్మానించారు. అనంతరం అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టత కోసం పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సతీమణి, అనిల్‌కుమార్‌యాదవ్ సతీమణి, ఇద్దరు కుమారులు పాల్గొన్నారు.

ఒకరితో ఒకలా.. మరొకరితో ఇంకోలా..!

● రిజిస్ట్రేషన్ల శాఖలో ఉన్నతాధికారుల వివక్ష

● గంటల వ్యవధిలోనే మేడ్చల్ డీఐజీగా మధుసూదన్‌రెడ్డికి పోస్టింగ్

● 10రోజులు దాటినా కరీంనగర్ డీఐజీగా రవీందర్‌కు అందని ఉత్తర్వులు..!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, అధికారులపై ఐజీ స్థాయి ఉన్నతాధికారులు వివక్ష కనబరుస్తున్నారంటూ ఉద్యోగ సంఘాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వివిధ స్థాయిల్లో ఉద్యోగులు, అధికారుల నియామక ఉత్తర్వులను అమలు చేయడంలో వివక్ష కనబరచడమే కాకుండా, ఆయా ఉత్తర్వులను సదరు వ్యక్తులకు అందించడంలోనూ కమిషనర్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంపై ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా డీఐజీ నియామకంలో అధికారుల వింతవైఖరి గురించి 'ఆరు నెలలు తిరక్కుండానే అదే ఆర్డర్' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రిజిస్ట్రేషన్ వర్గాల్లో తీవ్రంగా చర్చ జరిగింది. ఆయా నియామకాలపై హైకోర్టులో రిట్ పిటీషన్ ముగియకుండానే ప్రభుత్వం ఈ నెల 10న (గతేడాది ఇచ్చిన ఉత్తర్వుల మాదిరిగానే) జీఓలు జారీచేయడాన్ని ఉద్యోగ సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు మేడ్చల్ డీఐజీగా మధుసూదన్‌రెడ్డికి గంటల వ్యవధిలో ఆర్డర్స్ కమ్యూనికేట్ చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కార్యాలయం అధికారులు.. పది రోజులు దాటినా కరీంనగర్ డీఐజీగా నియమితులైన రవీందర్‌కు ఉత్తర్వులను ఎందుకు కమ్యూనికేట్ చేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులు, అధికారులందరికీ పెద్దదిక్కుగా ఉండాల్సిన ఐజీ స్థాయి ఉన్నతాధికారి, కొందరిపై ప్రేమ, మరికొందరిపై వివక్షను చూపడం సమంజసంగా లేదని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

సుధీర్‌కుమార్‌కు ఘన నివాళి



సుధీర్‌కుమార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పురుషోత్తంరావు, టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే పి.సుధీర్‌కుమార్ జయంతి వేడుకలు బుధవారం సైదాబాద్‌లో పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదన్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సుధీర్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్ కాలనీ సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చాదర్‌ఘాట్ : మాజీ ఎమ్మెల్యే పి.సుధీర్‌కుమార్ జయంతిని మున్నూరుకాపు సంఘం దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ కమిటీ అధ్యక్షుడు అనంతుల నవీన్‌పటేల్ ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు బుధవారం గడ్డిఅన్నారంలోని పీ అండ్ టీ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ కమిటీ చైర్మన్ పుట్టం పురుషోత్తంరావు, టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ పటేల్, మాజీ కౌన్సిలర్ బద్దుల వెంకటేశ్‌యాదవ్, నాయకులు బీచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, పులిపాటి త్రివేది పటేల్, మాజీ అధ్యక్షుడు తోట రాజు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రంథాలయోద్యమ సారథి వట్టికోట ఆళ్వారుస్వామి

● వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయోద్యమాన్ని నడిపించి, ప్రజలను తన అక్షరానికి పదును పెట్టడం ద్వారా చైతన్యపరిచిన గ్రంథాలయోద్యమనాయకుడు వట్టికోట ఆళ్వారుస్వామి అని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ ప్రజాసాహిత్యకులు, రచయిత, ఉద్యమకర్త వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని డా.బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బుధవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. 'వట్టికోట ఆళ్వార్ స్వామి- గ్రంథాలయోద్యమం' అనే అంశంపై మాట్లాడుతూ తెలంగాణ జాగృతి కోసం తెలంగాణ మట్టిగడ్డపై పోరు విత్తనాలు జల్లి ఉద్యమ సుమాలను పూయించిన సాహిత్య ఉద్యమ రైతు వట్టికోట అని అన్నారు. తెలంగాణ భాషకు యాసకు పెద్ద పీటవేసిన సాహిత్య మేరు నగధీరుడని ఆయన కొనియాడారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కె.సీతారామారావు మాట్లాడుతూ తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టికోట అన్నారు. తెలంగాణ ప్రజల జీవితాన్ని పోరాట తత్వాన్ని, సంస్కృతిని నరనరాన జీర్ణించుకుని గ్రంథ పఠనం ద్వారా లోకజ్ఞానం కలుగుతుందని సమాజాన్ని అర్థం చేసుకొని చైతన్య పరచవచ్చని ఊరూరా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించి ప్రజా చైతన్యానికి బాటలువేసిన ప్రముఖ సాహిత్య దిగ్గజం వట్టికోట అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్ రెడ్డి, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, విశ్వవిద్యాలయ లైబ్రరీ ఇన్‌చార్జి డా.ఎన్.రజని, పలు విభాగాల అధిపతులు, డీన్స్, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



స్మారకోపన్యాసంలో వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు

చక్రస్నాన మహోత్సవం

చాదర్‌ఘాట్ : మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో చక్రస్నాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

హుక్కా సెంటర్‌పై దాడి.. నిర్వాహకుడి అరెస్ట్

చంపాపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాపూర్‌లోని డైమాండ్ హోటల్ సమీపంలోని ది గెలాక్సీ కేఫ్, లాంజ్‌లో బహదుర్‌పూరా ఎంఓ కాలనీకి చెందిన యాహియా బిన్ ఖలైద్(23) అనధికారికంగా హుక్కా వ్యాపారం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్, కంచన్‌బాగ్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. 18సంవత్సరాల వయస్సు కంటే తక్కువ వయస్సు ఉన్న మైనర్‌లను హుక్కా కేంద్రలోకి అనుమతించడం, హుక్కా(పొగాకు ఉత్పత్తులు)అందించడం, నిర్దేశించిన నిబంధనలు ఉల్లంఘించడం, హుక్కా కేంద్రాన్ని చట్టవిరుద్ధంగా నిర్వహిస్తుండటంపై సోదాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకునేందుకు సమయం లేకపోవడంతో ఇద్దరు సాక్షులు హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ గౌస్(34), ఎండీ హజర్‌ఖాన్(34) మధ్యవర్తుల మధ్య హుక్కా కేంద్రంపై దాడి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో హుక్కా నిర్వాహకుడు యాహియా బిన్ ఖలైద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. హుక్కా కేంద్రం నుంచి తల పైపులతో పాటు 18 హుక్కా కుండలు, 30హుక్కా పైపులు, ఆల్ ఫకర్ 2 ఆపిల్ ఫ్లేవర్ 1, ఎలక్ట్రిక్ స్టవ్, 8వందల నగదు, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. బుధవారం నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.